

# ముద్దుగుమ్మ పైడి బొమ్మ

ప్రొ॥ కొండమూడి శ్రీరామచంద్రమూర్తి

ఇల్లంతా శోభాయమానంగా అలంకరిస్తోంది హైమ. ముందు హాల్లో, వెనకున్న తెల్లటి గోడమీద 'ఇందు సీక్స్ యువర్ బ్లెస్సింగ్స్' అన్న ఇంగ్లీషు అక్షరాల్ని ముద్దబంతి పువ్వులతో, ముద్దొచ్చే గులాబీలతో, అరవిరసిన జాజులతో అందంగా పేరుస్తోంది. కొన్ని పువ్వులు సరిగ్గా అంటుకోక కిందపడిపోతుంటే, వాటిని మళ్లీ యథాస్థానాల్లో కుదురుగా ఉంచటానికి కుస్తీ పడుతోంది.

ముంగాళ్ల మీద నుంచుని, కుడిచెయ్యి పైకెత్తి, పమిట చెంగు పట్టు నిలవక కిందకు జారిపోతుంటే, మొహానికి పట్టిన చిరుచెమట సన్న ముత్యాలు పేర్చినట్లు మెరుస్తుంటే, గాలి కెగిరే ముంగురులు కళ్లకడ్డం వస్తుంటే, కళ్లు చికిలిస్తూ ముగ్ధమోహనంగా కనిపిస్తోంది. సౌందర్య భాజకంగా మురిపిస్తోంది.

గడప దగ్గరగా ప్లాస్టిక్ బంతితో ఇందు ఆడుకుంటున్నది. అచ్చు తల్లి నోట్లోంచి ఊడిపడ్డట్టుగా ఉంది.

సీలింగ్ కింద రంగు కాగితాల తోరణాలు ... గుమ్మానికి 'వెల్‌కం బోర్డు', గోడమీద కాబినెట్ సైజులో లామినేటెడ్ గ్రూపు ఫోటో, ఆ పక్కనే పెద్దపెద్ద అరల్లో అనేక సంఘాలవారు అభినందన పూర్వకంగా నా కిచ్చిన జ్ఞాపికలు - ఇవన్నీ ఒకెత్తయితే, అద్దాల బీరువాలో పొందిగ్గా అడుగునున్న రైతన్న అయిదారు బొమ్మలూ ఒక ఎత్తు. ఆ బొమ్మలకు నిజం జుట్టే ఉంది. వాటి కళ్లు నల్లగా నిగనిగలాడుతూ వడుతూ లేస్తున్నాయి. ఒక్కో బొమ్మకు ఒక్కోరకం బొట్టు - నయనానందకరంగా ఉంది. చిన్న చిన్న మొహాల్లో ముద్దొచ్చే ఎర్రని పెదిమలు. కొన్నిటికి కొన తేలిన ముక్కులు, మగ బొమ్మలకు వాటికి తగిన దుస్తులు. ఆడబొమ్మలైతే ఆభరణాల అలంకారాల తళతళలు. మణిపురి పద్ధతిలో కొన్ని ఉంటే, ఒకటి రెండు రాజస్థానీయంగా ఉన్నాయి. ఆ బొమ్మ లన్నింటిలోనూ రాధాకృష్ణులు మరీ కొట్టవచ్చేట్లుగా ఉన్నారు.

కృష్ణుడు వ్యత్యస్త పాదారవిందంగా నిలబడి మురళి ఊదుతున్నాడు. రాధ అతని పాదాల చెంత కూర్చుని అరమోడ్పు కన్నులతో తల పైకెత్తి తన ప్రాణసఖుణ్ని పలకరిస్తోంది.

"అలా బొమ్మల కేసి చూస్తూ కూర్చోకపోతే, ఇలా వచ్చి కాస్త సాయం చేయకూడదూ!" హైమ నిష్ఠూరంగా అడిగింది.

"బొమ్మల్నే కాదు, ఆ బొమ్మలు చేసిన ముద్దుగుమ్మను కూడా చూస్తూనే ఉన్నా!" అన్నా న్నేను కవ్వింపుగా.

హైమ నా వైపు పులుకూ పులుకూ చూసింది. మామూలుగా నిలబడింది. కొంగుతో మొహం అద్దుకుని, మెల్లగా నడుస్తూ నా దగ్గరకు వచ్చి, టేబిల్ మీద రెండు చేతులూ ఉంచి, కొంచెం ముందుకు వంగి, నా మొహంలోకి చూస్తూ - "ఎంతకాలం నుంచి అడుగుతున్నా ఇదిగో చెబుతా, అదిగో చెబుతా అంటూ మాట దాటేస్తూ వస్తున్నారు. కనీసం ఇవ్వాళైనా - ఇందూ పుట్టినరోజునాడైనా చెబుతా రా?" అన్నది అర్థింపుగా.


"ఏం చెప్పమంటావ్?"

"తెలియదా నా ప్రశ్న ఏమిటో?"

హాల్లో నుంచి కన్ను తిప్పితే బయట రోడ్డు కనిపిస్తోంది. జనప్రవాహం వడి తగ్గింది. చల్లగాలి తిరిగింది. ఆరిన కుంపటిలాగా ఉన్న ఓ ముసలిది ఏక్‌తార మీటుకుంటూ ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా ముందుకు కదులుతోంది.

మట్టిలో పుట్టావు మనిషీ
మట్టిలో కలిసేవు మనిషీ
మట్టిలో కలిసేటి మట్టి బొమ్మల పైన
మమకార మేలనే మనిషీ?

అంటూ తత్వం పాడుతోంది.



"తప్పు, తప్పు! మమకారం లేకపోతే బతుకులో మిగిలేది వికారమే!" అన్నాను తల అడ్డంగా తిప్పుతూ పెద్దగా.

"నా మాటకు సమాధానం చెప్పకుండా, ఆ అడుక్కునే దాని పాటకు జవాబు చెబుతా రేమిటీ?" హైమ ఉడుక్కుంది.

"అదే నీకూ సమాధానం కాబట్టి!"

"నే న్నమ్మను. చావు బతుకుల్లో ఎముకల గూడులా ఉన్న నన్ను చూసి మీరు ప్రేమలో పడ్డారంటే ..." అర్ధోక్తిలో ఆగిపోయింది. ఆ మాటలంటున్నప్పుడు ఆ గొంతు కొంచెం వణికింది - ప్రేమ బరువుతోనా? తన మీద తనకే కలిగిన సానుభూతితోనా? లేకపోతే, కృతజ్ఞత? హైమ వైపు ఆర్ద్రంగా చూశాను, ఆమె మొహంలో ఆ బొమ్మల మొహాలన్నీ ప్రతిఫలిస్తున్నాయి. కాలం పుటల్ని మనసులోనే తిరగేసుకున్నాను.

*** **** *****

మా ఇల్లు మెయిన్ రోడ్డు మీదే ఉంది. రోడ్డుకు అటూ ఇటూ షాపులు. బయట కొస్తే చాలు జీవితం శబ్దమయంగా, చైతన్య సంభరితంగా, కళా విలసితంగా ఉన్నట్లు కనిపిస్తుంది. మన దేశం సంపద్వంతమైన దన్న భ్రాంతి కలుగుతుంది. మనుషులు మరబొమ్మలన్న భావం మిగులుతుంది. అందుకనే రవంత విశ్రాంతి కావాలనుకున్నప్పుడు, కృష్ణానది పక్కనున్న మునిసిపల్ పార్కుకు వెళ్లి కూర్చుంటాను. ఆ పార్కుకు ఎక్కువమంది రారు, వచ్చినవాళ్లు కూడా నాలాగా కలల్లో బతికేవాళ్లే కానీ, కల్ల బతుకులవాళ్లు కాదు. అక్కడికే వెళ్లటానికి ఇంకో కారణం కూడా ఉంది.

ఆ పార్కుకు దగ్గర్లో ఓ బొమ్మల దుకాణం ఉంది. మట్టి బొమ్మలు, ప్లాస్టిక్ బొమ్మలు, రబ్బరు బొమ్మలు, పోత బొమ్మలు, కొయ్య బొమ్మలు, వెండి బొమ్మలు, కాగితం బొమ్మలు - రకరకాల బొమ్మలు, రంగు రంగుల బొమ్మలు, నవ్వే బొమ్మలు, ఏడ్చే బొమ్మలు, కోపం బొమ్మలు, నవ్వించే బొమ్మలు ... ఆ బొమ్మల్ని చూస్తుంటే దేవుడు చేసిన మనుషుల బొమ్మలకన్నా మనిషి చేసిన మట్టి బొమ్మలే బావున్నా యనిపిస్తుంది.

ఆ రోజు పొద్దున్నే ఓ స్నేహితుడు ఫోను చేశాడు - "ఇవ్వాళ మా అబ్బాయి పుట్టిన్రోజురా! వచ్చి అక్షింతలు వేసి, మదర్పిత చందన తాంబూలాదులు స్వీకరించి వెళ్లు!" అని.

"చందన తాంబూలాదు లేమిట్రా! అవి పెళ్లికి. టీ పార్టీ కదా?"

"ఉన్నాయ్‌లేవోయ్! నువ్వు రచయితవు కదా! కాస్త ముందుగా చెబుతున్నాలే! టీ పార్టీయే కాదు, నీలాంటి దగ్గరవాళ్లకు డిన్నర్ కూడా ఏర్పాటు చేస్తున్నాలే!" అన్నాడు వాడు.

"ఐటమ్స్ ఏమిటి?"

"ముందే చెప్పాలా?"

"చెబితే దాన్ని బట్టి తయారై వస్తాను. ఇంత దూరం నుంచి వచ్చినందుకు, ఇష్టం లేనివైతే ఇబ్బంది పడాలి కదా!"

"అయితే కావలసిన వేవో నువ్వే పొట్లాలు కట్టి తెచ్చుకో! ఆ బిల్లు నా మొహాన పారేయ్!"

"బాచిలర్స్ బిల్స్ పెళ్లైన వా ళ్లేం చెల్లించగలర్రా! కోతలు కోయకు!"

"థాంక్స్ టు మై వైఫ్, నా కా బాధేం లేదు. ఉయ్ ఆర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్!"

నిజమే! వాడూ, వాడి భార్యా 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లాగానే ఉంటారు. కన్నవాళ్లను కాదని ఆ అమ్మాయినే కావాలని చేసుకున్నాడు. చేసుకున్నందుకు ఆ అమ్మాయి కూడా వాణ్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటోంది. సంసారం ఒద్దికగా గడుపుకుంటోంది. వాళ్ల ప్రేమ ఫలంగా ఇప్పుడు వాళ్ల కో కొడుకు.

జీవితాన్ని ఓ నవ్వుల పంటగా, ఓ తియ్యటి కలగా, ఓ మధుర జ్ఞాపకంగా మార్చుకునే వాళ్లంటే నా కెంతో ఇష్టం. నా రచనలూ అలాగే ఉంటాయి. మనుషులతో నా వ్యవహారమూ అలాగే ఉంటుంది.

ఇష్టమైందా మల్లెతీగలా అల్లుకుపోతాను.

కష్టం కలిగిందా, 'టచ్ మి నాట్'లా దూరంగా జరిగిపోతాను.

అందుకే అయినవాళ్లంతా నన్ను "యు ఆర్ ఏ రొమాంటిక్ ఫెలో" అంటూంటారు. అంటే అన్నారు, మమతల చలువ వెన్నెల్లో సోలిపోవడంలో ఉన్న ఆనందం యథార్థాల ఎండలో సేద తీరడంలో లేదని నా అభిప్రాయం! ఇప్పుడు నా స్నేహితుడి కొడుకు పుట్టినరోజు పండగకు ఏం బహుమతి తీసుకెళ్లాలీ అన్నది ప్రశ్న. ఏ రసగుల్లా ప్యాకెట్టో, ఏ ఆడుకునే వస్తువో ఏదైనా ఇవ్వొచ్చు. కానీ ఓ రచయిత ఇచ్చేది ప్రత్యేకంగా ఉండాలని నా తాపత్రయం.

చటుక్కున ఆ బొమ్మల షాపు జ్ఞాపకం వచ్చింది. ఏ చిట్టి బొమ్మను నా స్నేహితుడి బంగారు తండ్రికి బహుమతిగా ఇచ్చినా, అది సందర్భోచితంగా, సభాగర్వంగా ఉంటుంది.

షాపులోకి వెళ్లాను. "ఓ అందమైన బొమ్మ కావాలయ్యా!" అడిగాను.

"ఎంతలో కావాలి, సార్! ఏ రకం బొమ్మ?"

"ఎంతలో అయినా సరే! స్పెషల్‌గా ఉండేది కావాలి."

"స్పెషల్ అంటే ..." షావుకారు వివరణ కోసం ఆగాడు.

"స్పెషల్ అంటే ... వెరీ వెరీ స్పెషల్. చూడగానే అటువంటిదే ఇంకోటి కావాలనిపించాలి!"

"ఓకే! అటువంటిదే ఇస్తాను, సార్! మీరు నో అనలేరు."

అతను లోపలకు వెళ్లి, పసిబిడ్డను ఎత్తుకుని

వచ్చినట్లుగా అతి జాగ్రత్తగా పట్టుకుని ఓ బొమ్మను తెచ్చాడు.

రెండడుగుల బొమ్మ. గులాబీరంగులో ఉన్న బొమ్మ. మొహం, చేతులు, కాళ్లు అన్నీ అద్భుతంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి. ముఖం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మోల్డ్‌లో ఉంది. దేహమంతా చమ్కీతో ఉంది. నిజమైన జడ. కాళ్లకు గుడ్డ చెప్పులు. మనం ఎటు తిరిగితే అటే తిరిగి మనవైపే చూస్తున్నట్లున్నా యా కళ్లు. మెరిసే బొట్టు, చెవులకు ఊగినలాడే లోలాకులు. ఫెంటాస్టిక్!

"ధరెంత?"

"అయిదొందలు!"

"అయిదొందలా?"

"అయి దొందలేమిటి సార్? వెయ్యి రూపాయలపైనే చెప్పాలి. కానీ అంత ధర పెట్టి కొనరని, పొట్ట నిండడంకోసం నగం వెలకే అమ్ముకుంటోంది ఆ అవ్వ!"

"అవ్వా!"

"అవును, సార్! పళ్లు కూడా ఊడిపోయాయి. వారానికీ, పది రోజులకూ ఓ బొమ్మ తెస్తుంటుంది. అమ్ముడుపోతే డబ్బిస్తాను, లేకపోతే కొద్దో, గొప్పో అడ్వాన్సిచ్చి పంపించేస్తాను!"

ఆ బొమ్మ వైపు మరోసారి చూశాను. ఈసారి మరో ప్రత్యేకత కనిపించింది. ఆ బొమ్మలో పరిపూర్ణమైన యౌవనం ఉంది. కళ్లు కవ్విస్తున్నాయి, పెదిమలు హసిస్తున్నాయి, నర్వాంగాలూ ఉపగుహనోద్రిక్తకు ఎదురు చూస్తున్నట్లున్నాయి, ఉండీ లేనట్లున్న నడుము, స్తన భారానికి చలిస్తున్నట్లుగా ఉంది. సెక్సీగా, క్వీన్లీగా, కాస్ట్లీగా ఉందా బొమ్మ

"ప్యాక్ చేయండి!"

ఆ బహుమతి నందుకున్న నా స్నేహితుడి కళ్లు మెచ్చుకుంటున్నట్లుగా మిలమిలా మెరిశాయి. "బ్యూటీఫుల్!" అని అనకుండా ఉండలేకపోయాడు. కొడుక్కి ఇవ్వకుండా తన దగ్గరే దాచుకున్నాడు. 'బ్యూటీ ప్రొవేకేట్ థీవ్స్ సూనర్ దేన్ గోల్డ్' అని షేక్స్‌పియర్ అననే అన్నాడు.

ఆ బొమ్మను నేను బహుమతిగా ఇవ్వడం దగ్గరనుంచీ నాకు ఆహ్వానాలు రావడం ఎక్కువైంది. విచిత్రం ఏమిటంటే ఓ ఫ్రెండు తన నప్షల్ ఫంక్షన్‌కు నన్ను స్పెషల్ గెస్ట్‌గా ఆహ్వానించాడు. ఆహ్వానం వరకూ బాగానే ఉంది, మరి బహుమతుల నంగ తేమిటి?

వట్టి చేతులతో వెళ్లలేం. బరువుగా వెళ్లినప్పుడల్లా నా జేబు తేలికైపోయేది. బొమ్మను కొన్నప్పుడల్లా నాకు ఒకటే నందేహం. బొమ్మలో యౌవనం ఉంది. బొమ్మను చేసిన అవ్వలో మునలితనం ఉంది. కొడిగడుతున్న దీపం తన తొలినాటి కాంతిని జ్ఞాపకం చేసుకుంటోందా?

ఓసారి షావతణ్ని యాథాలాపంగా అడిగాను - "ఒక్కో బొమ్మకన్నా నాలుగైదు బొమ్మలు ఒకేసారి కొంటే ధరేమైనా తగ్గుతుందా?"

"నాలుగయిదు ఒకసారి దొరకవు, సార్! కావాలంటే మీ రా అవ్వను కలుసుకుని ఆర్డరివ్వండి!"

"అడ్రను తెలుసా?"

"నరిగ్గా తెలియదు. ఈసారి వచ్చినప్పుడు కనుక్కుని చెబుతాను!"

వారమైంది, పదిరోజులైంది. షాపులో బొమ్మ లేదు, ఆ అవ్వ రాలేదు. ఒక దగ్గరి బంధువు




కూతురు పెళ్లికి ఆహ్వానం వచ్చింది. బహుమతి తీసుకు వెళ్లాలి. మెరిసే రంగు గుడ్డల రాకుమార్తె బొమ్మ తప్ప ఇం కేమిచ్చినా వాళ్లకు నంతృప్తిగా ఉండదు. నాకు బొమ్మల కవిగా ముద్ర వడిపోయింది. రాసే ప్రతివాడూ కవే జనానికి. కవికి, రచయితకూ ఉన్న తేడాను కూడా గుర్తించరు. షావతడిని కనుక్కుంటే, ఏవో కొండగుర్తులు చెప్పాడు. చెప్పిన చోటికి వెళ్లి విచారిస్తే, "బొమ్మలమ్మే మునిల్దేనా?" అంటూ అటువైపు వెళ్లమని ఒకడూ, ఇటువైపు అని ఇంకొకడూ చెప్పి, మొత్తంమీద ఓ పాత పెంకుటింటి దగ్గరకు నన్ను చేర్చారు.

ఇంట్లో ఒక భాగం వడిపోయింది. రెండో భాగంలో కూడా అక్కడా అక్కడా పెంకులు లేచిపోతున్నాయి. గోడలకున్న సున్నం రాలిపోయింది. మూలల్లో సాలెగూళ్లు. వరండాలోకి ఉన్న ముందు గదిలో గుమ్మం దగ్గర గడపమీద చతికిలబడి లోపలకు చూస్తూ ముగ్గుబట్ట తలతో వండిన బొప్పాసికాయ మొహంతో, ఆటీవండురంగులో ఉన్న ఓ ముసిలావిడ వరుషంగా, పెద్దగా అంటోంది - "రోగం, రోగం అంటూ ముడుసుకు వడుకుంటే ఎవ డెట్టాడే నీకు తిండి? నువ్వు సావడం కాదు, నన్ను నంపుతున్నావు గందే!"

"అవ్వా!"

ఆ తిట్టే మొహం చటుక్కున ఇటువైపు తిరిగింది. బొమలు ముడిచింది, కళ్లు చిట్లించింది - "ఏందయ్యా?" అంది. వినగటగా.

"బొమ్మలవ్వంటే ...!"

"నానే! ఏం కావాలి?"

"బొమ్మలు ..."

"లేవు! సెయ్‌లా. సెయ్‌టం కుదర్లా!" చాలా కరుగ్గా ఉంది ఆ స్వరం.

బెరుకు బెరుగ్గా ఉన్నది నన్నని గొంతు లోపల్నుంచి - "మామ్మా!" అంటూ వినిపించింది.

"ఆ, వత్తున్నా!" అవ్వ లోపలకు వెళ్లింది.

"లోపలకు పిలు, మామ్మా! ఏం బొమ్మ కావాలో కనుక్కో!" నూతిలో గొంతుకలా ఆ అమ్మాయి అంటుంటే, విరిగిన ఉరుములా అన్నది అవ్వ - "ఈ బుద్ధి వారం కిందటే ఉంటే, కొరానికి మందిప్పించేదాన్నిగా!"

అవ్వ లోపలకు రమ్మనకుండానే నేనే లోపలకు వెళ్లాను స్వతంత్రించి. లోపల మడతమంచం మీద ఓ పాతికేళ్ల అమ్మాయి వడుకుని ఉంది.

పాలిపోయిన మొహం, పీక్కుపోయిన దవడలు, రేగిన జుట్టు, ములక్కాడలా ఉన్న చేతులు - శరీరంలో ఎక్కడా జీవకళ లేదు.

"ఏం బొమ్మ కావాలో సెప్పి, ఎడవాన్సిచ్చెళ్లు! ఓ వారంలో సేసిస్తా!"

'చేసిస్తా' అన్నదో, 'చేయించిస్తా' అన్నదో నరిగ్గా వినవడలేదు. "నూత్తన్నావ్‌గా దీన్ని! లేవనేదు, ఒళ్లంతా నచ్చువడిపోనాది, డాకటేర్ను పిలుద్దామంటే డబ్బు నేదు!"

మంచం చుట్టూతా, గది నిండా రంగు రంగుల వస్తువులు పడి ఉన్నాయి. ప్లాస్టిక్ మొహాల మోల్డ్స్, గుడ్డ పీలికలు, చిన్న చిన్న గాజులు, రోల్డ్ గోల్డ్ నగలు, బొట్టు సీసాలు, కుంచెలు - కంటిముందున్న వికృతత్వంలో కనిపించని సౌందర్యం దాగి ఉంటుందంటే నమ్మబుద్ధి కావడంలేదు. అయితే అవ్వా చేయక, ఆ అమ్మాయీ చేయకపోతే ఆ బొమ్మల్ని ఇం కెవరు చేస్తారక్కడ? ఏ అదృశ్య దేవతా హస్తమో అనుకోడానికి నేను చదువుకున్న సైన్సు ఒప్పుకోవడంలేదు.

ఆ అమ్మాయి మూలుగుతోంది. "ఏం బొమ్మ కావాలి మీకు?" అడిగింది.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పడం కన్నా అన లా అమ్మాయికి ఏం జబ్బో, ఒళ్లంతా ఎందుకలా చచ్చుబడిపోయిందో తెలుసుకోవాలని ఎందుకో అనిపించింది.

"ఏ జబ్బయితే ఏముందయ్యా? వణ్ణాం నేకుంటే ఏ జబ్బైనా వొత్తుంది. వణ్ణాం ఉండాలంటే బొమ్మ లమ్ముకోవాల - ఏత్తే గందా అమ్ముకోడం?" అన్నది అవ్వ నిష్ఠూరంగా.

ఆ అమ్మాయి కళ్లల్లో ఒకానొక నిర్లిప్తత, ఏదో నిస్పృహాయత, ఇతమిత్థం కాని అనానక్తత నాకు కనిపించాయి. అన్నింటి మధ్యా మళ్లీ ఏదో లాలన. కారణం చెప్పలేను కానీ, గబుక్కున అన్నాను - "మీరు బొమ్మలు తయారుచేసిస్తే, డబ్బు లివ్వను. ఈ అమ్మాయికి తగిన వైద్యం చేయిస్తాను. మీ కిష్టమేనా?"

నమ్మలేని మాట నేదో విన్నట్టుగా ఆ అమ్మాయి

కళ్లు ఆల్చిప్పలైనాయి.

"అంత డబ్బెట్టి ఇప్పుడు దానికి వైద్దిగం ఎందుక్కానీ, నువ్విచ్చే డబ్బు లేవో ఇచ్చెళ్లు! ఆ డబ్బుల్తో తిన్నన్నాళ్లు తిని, ఎట్లాగో అట్లా బొమ్మలు తయారు సేసిత్తాం!"

ఆ అమ్మాయి మొహంలో 'అయ్యో' అన్న దైన్యం. 'సహాయం చేయరూ' అన్నట్లుగా చేతులు రెండూ దగ్గరకు చేర్చటానికి ప్రయత్నం చేసింది.

"ఆ అమ్మాయి ..." అని నే ననగానే -

"హైమ!" అన్నది లోగొంతుకలో ఆ అమ్మాయి.

"అదే, హైమకు వైద్యం చేయించటానికి ఒప్పుకుంటేనే డబ్బిస్తా!"

బెదిరించటాని కన్నట్లుగా నేను గుమ్మం వైపు కదిలాను - హైమకు కంటితో సంజ్ఞ చేసి. నా నటనకు హైమ పెదిమల పైన మొదటిసారిగా కనిపించీ కనిపించని విదియనాటి చంద్రరేఖ.

"అట్లాగే, ఇచ్చిపో!" అయిష్టంగానే అన్నది ఆ అవ్వ.

డబ్బులిచ్చిన తర్వాత ఓ డాక్టర్ని తీసుకెళ్లాను ఆ ఇంటికి. సత్తు కంచంలో నూక లన్నంలో కొరివికారం వేసుకుని తిన్న తర్వాత, డాక్టరు వచ్చిపోవడానికి పెద్దగా ఆ అవ్వ అభ్యంతరాలేమీ చెప్పలేదు.

మెల్లగా వైద్యానికి అనుకూలంగా హైమ స్పందించడం మొదలైంది. హైమే ఆ బొమ్మలు తయారుచేసిం దనడానిక్కూడా ఆ అవ్వ ఏమీ సంకోచించలేదు.

"నా మనవరాలే నయ్యా నా కింత కూ డెట్టే ఆదారం!" అన్నది ఒకరోజు. హైమకు ఓ టానిక్కు రాసిచ్చిన తర్వాత, బయట కొస్తూ నాతో అన్నాడు డాక్టరు - "అస లా అమ్మాయికి వైద్యం ఎందుకు చేయిస్తున్నారు, కవిగారూ! జబ్బేమీ లేదే! షి ఈజ్ పర్‌ఫెక్ట్‌లీ నార్మల్!"

"టానిక్కులు చాలంటారా?" అడిగా న్నేను.

"ఇది కూడా మానసిక తృప్తి కోసం. అంతే!" అన్నాడు డాక్టరు స్కూటరు స్టార్ట్ చేస్తూ.

డాక్టరు చెప్పింది నిజమే అన్నట్లుగా ఇప్పు డా అమ్మాయి చిగురించిన మామిడిలా ఉంది. ఆ అమ్మాయి అప్పుడప్పుడూ చెప్పిన వివరాల ప్రకారం -

హైమకు పదేళ్ల వయసులో తల్లిదండ్రు లిద్దరూ ఒకేసారి ప్రమాదంలో పోయారు. ఆ ప్రమాదంలోనే హైమ క్కూడా కాలికి దెబ్బ తగిలింది. నడవడం కష్టమైంది. నా అనేవాళ్లు లేరు. ప్రభుత్వం దయాధర్మంగా ఏదో కొంత ఇస్తే, తాను ఆ అమ్మాయికి దూరపు బంధువు నని దగ్గరకు చేరిన అవ్వ, ఆ డబ్బు ఉన్నంతవరకూ జాగ్రత్తగానే చూసి, లేని రోజులు రాగానే, 'నువ్వు సంపాయిస్తావా, చస్తావా!' అని ఆ పిల్ల మెడల మీధ కూర్చుంది. కోపం వస్తే చాలు - 'అవిటి ముండా!' అని తిట్టేది. తోటి పిల్లలతో కలిసి తిరగనిచ్చేది కాదు.

ఇంతలో హైమ పెద్దమనిషైంది. "ని న్నెవడు చేసుకుంటాడే, దరిద్రపుగొట్టు మొహమా!" అని ఈసడించుకునేది, ఆత్మ న్యూనతా భావా న్నేర్పరచింది. నిరాశమయమైన ఒంటరితనంలో బతకడం అలవాటు చేసింది. ఒకరోజున బయట కురుస్తున్న వానలో తడుస్తూ, కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ తన్మయత్వంలో



హైమ గోడ కానుకుంది.

అదిగో ఆయన తనవైపే వస్తున్నారు ... తనను కట్టుకున్నవాడు. ఆ మొహంలో తన మీద ఎంత ప్రేమ ... ఆ కళ్లల్లో ఎంత దయ! తన దగ్గరగా వచ్చాడు. చేతులు చాచాడు. తను ఆయన చేతుల్లో గువ్వపిట్టలా ఒదిగిపోయింది. ఇదేమిటి తను ఇద్దరి మధ్యా ఓ బంగారు బాబు! ఎంత ముద్దుగా ఉన్నాడు! తనను ఎత్తుకోమని మారాం చేస్తున్నాడు. "వదలండీ! న న్నొదలండీ! మన బాబు ఏడుస్తున్నాడు, వినబడటంలా! వాడికి పాలిచ్చి, లాలపోసి మళ్లీ ఇప్పుడే వస్తా కదూ! మీరు ఎంతో మంచివారంట! భార్య చెప్పిన మాట వింటారంట!" - హైమ పెదిమలు ఆ మాటల్ని ప్రేమగా ఉచ్చరిస్తున్నాయి. హైమ కళ్లు ఆనందబాష్పాలు కారుస్తున్నాయి. ఆమె చేతులు ఆలంబనంగా ఓ స్తంభాన్ని కౌగలించుకున్నాయి.

"ఏమిటే! కలలు కంటున్నావా? నీకు పెళ్లీ పెటాకులూ కూడానా? ఒకవేళ అయితే గియితే అవిటి పిల్లలే పుడతారు నీకు! అది గ్నావక ముంచుకో!" హైమ నెత్తిమీద రెండు మొట్టికాయలు గట్టిగా వేస్తూ అవ్వ మందలించింది.

"అబ్బా!" అంటూ, లజ్జా విషణ్ణ వదనంతో కింద కూలబడిపోయింది హైమ. ఆ విషణ్ణతలో, ఆ చీకటి ఏకాంతంలో హైమకు ఒకే ఒక కార్యక్రమం - బొమ్మలు చేయడం! ఆ విద్య తన కెలా వచ్చిందో ఆమెకే తెలియదు! కళ్లు మూసుకుంటే స్వప్నలోకాల్లో ఏవో బొమ్మలు కనిపించేవి. తయారుచేయడానికి ఏవేం కావాలో అవ్వకు చెప్పేది. ఎట్లాగో అట్లా తంటాలు పడి అవ్వ వాటిని కొనుక్కువచ్చేది. బొమ్మ తయారుకాగానే కొట్టుకు తీసుకువెళ్లి అమ్ముకువచ్చేది. చెయ్యడం వరకే హైమ వంతు, ఎంత వచ్చిందీ ఆమెకు తెలియదు. బయట ప్రపంచం ఎంతగా ప్రశంసల వర్షం కురిపించినా, ఆ వర్షపు తడి ఆమెకు తగిలేది కాదు.

న న్నెప్పుడూ ఒంటరిగా హైమను కలుసుకోనిచ్చేది కాదు ఆ అవ్వ. కాని నేను వెళ్లిన ప్రతిసారీ హైమలో మెలమెల్లగా వస్తున్న మార్పును కనిపెడుతూనే ఉన్నాను. నేను వెళ్లిన ప్రతిసారీ హైమ మంచంలోనే కూర్చోడానికి ప్రయత్నించింది. ఒకసారి లేచి రెండడుగులు కూడా వేసింది నా వైపు. పడకుండా నేను పట్టుకున్నాను.

ఒకరి శ్వాస మరొకరికి తాకింది. ఒకరి కళ్లల్లో మరొకరు ప్రతిఫలించారు. 'సుప్తమై ఉన్న రాగతంత్రి ఒక్కసారి చకితమై మేల్కొన్నట్లు నా గుండె ఎందుకలా కొట్టుకుంటున్నది? హైమలో ఏమి టా మార్పు?' ఆమె బుగ్గల్లో బాలకాముని ఎర్రదనం!

ఈ దృశ్యం చూసింది అవ్వ. మర్నాడు వెళ్లినప్పుడు - "నువ్విచ్చిన డబ్బులకూ, సేసిచ్చిన బొమ్మలకూ సరిపోయింది. ఇంక రానక్కర్లేదులే, అయ్యా! శానామంది బొమ్మలు కావాలంటున్నారు, అల్లకూ సేసివ్వాలిగా మరి!" అన్నది.

"నీ బొమ్మ నాకే కావాలి. ఎంతివ్వమంటావో చెప్పు!" అన్నాను కోపంగా.

"ఎంతిచ్చినా నా బొమ్మ నీ కమ్మనయ్యా! నలుగురి మీద ఆదారపడి బెతికేవాళ్లం! ఒక్కణ్నే నమ్ముకుంటే, బెతుకు లెట్టా గడుత్తాయ్!"

దెబ్బతిన్న అహంతో, గాయపడ్డ హృదయంతో ఆ ఇంటి మెట్లు దిగాను. వెనకనుంచి హైమ చూపులు వచ్చి నన్ను గుచ్చుకోవడం నాకు తెలుస్తూనే ఉంది.

ఇంటికి తిరిగి వచ్చాను. ఏమైందో తెలియదు. అర్థంపడ్డాను. మలేరియా అన్నారు ముందు, టైఫాయిడ్ అన్నారు తర్వాత. ఏమైనా బయటకు కదలడంలేదు. హైమను చూడటంలేదు. రాత్రిపూట ఏవేవో పిచ్చి పిచ్చి కలలు హైమ నా కోసం ఆక్రోశిస్తున్నట్లు, పరుగెత్తుకుని వస్తున్నట్లు, రాకుండా వెనకనుంచి ఆ అవ్వ గట్టిగా పట్టుకుని ఆపుతున్నట్లు ...! లేస్తే నీరసం. కళ్లు తిరుగుతున్నట్లు, ప్రపంచంలో నా కెవరూ లేనట్లు

"ఏమిటి, కవీ! మనసులో ఏదో సంకోచం పెట్టుకుని నీ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నావు! ఇటీజ్ టూ బాడ్!" అన్నాడు డాక్టరు మందలింపుగా.

మనసులో ఏదో పెట్టుకునా? అవును, ఏం పెట్టుకుని? హైమనే రక్షించలేకపోయాను ఆ రాక్షసి గృహ నిర్బంధం నుంచి! ఆ భావనే నన్ను కాల్చివేస్తోంది. నేను అశక్తుణ్నయ్యాను. నా మానసిక అశక్తత దైహికంగా అశక్తతకు దారితీసింది. ఇప్పుడు నాకు అర్థమైంది హైమ భౌతికంగా అలా జీవచ్ఛవంలా ఎందుకు మిగిలిపోయిందో! రాగ రాహిత్యమే ఆమె బాధ! హైమా! హైమా! నీ కనురాగం పంచితే, నువ్వు పరిపూర్ణ ఆరోగ్యవంతురాలి వవుతావు! ఒక్క మంచి మాట, ఒక చల్లని చూపు నీకు దొరికితే పులకిత దేహంతో, పౌర్ణమి జ్యోత్స్నవై, కళాస్రష్టవై మురిపిస్తావు!

నా ధైర్యాన్ని నేనే మెల్లగా కూడగట్టుకున్నాను. పట్టుదలగా బొమ్మల దుకాణం దగ్గర కాపు వేశాను. అదిగో ఆ ముసల్ది, ఆ రాక్షసి హైమ చేసిన బొమ్మను పదిలంగా పట్టుకుని దుకాణం వైపుగా వస్తోంది. ఆc, దుకాణంలోకి వెళ్లింది. నేను గబగబా స్కూటరు స్టార్టు చేసి హైమ ఇంటికి వెళ్లాను. లోపలికి వెళ్లి చూసి నిశ్చేష్టుణ్నయ్యాను.

ఏముంది హైమలో రక్తమాంస విరహితమైన

పట్టీ కట్టి! పాలిపోయిన మొహంలో బుగ్గల మీద అటూ ఇటూ రెండు జ్వరం మచ్చలు, ఎర్రగా వుండ్లు వడ్డట్టు - రానున్న ప్రమాదానికి సంకేతాల్లాగా ఉన్నాయి అవి. పెయింట్లూ, రంగుల గుడ్డపీలికలూ, దారాలూ, బొమ్మ తయారీకి కావలసినవన్నీ ఆమె చుట్టూతా ఉన్నాయి.

"ఊహుఁ, నే చావను! నేను చేయాలనుకున్న చిట్ట చివరి బొమ్మను తయారుచేసేవరకూ నేను చావనే చావను!" అన్నట్టుగా ఉంది ఆమె అంతటి అపాయంలోనూ.

ఆ బొమ్మ ఆమె కల. ఏ తీపి ఆత్మ ముక్కలు ముక్కలుగా విరిగి మెలమెల్లగా కరిగి అంతరించిపోతోందో ఆ ఆత్మకు ప్రతిబింబం.

హైమ నన్ను చూసి ఆశ్చర్యంతో, "మీరా?!" అన్నది.

"హైమా! హైమా! మై డియర్, సమయానికి వచ్చాను. అవును, రాగలిగాను. నీకు సహాయం చేయడానికే వచ్చాను. నీ అనారోగ్యానికి కారణం తెలుసుకోగలిగాను, హైమా! చిట్టచివరికి కనుక్కోగలిగాను!"

"ఇప్పుడు దానివల్ల లాభ మేమిటి?" అతి మెల్లగా అన్నది హైమ.

"లాభం ఉంది. నువ్వు స్రష్టవు, కళాస్రష్టవు! ఉత్త మట్టి బొమ్మవు కాదు. నిన్ను నే బాగుచేసుకుంటాను, నిన్ను నరకంలోనుంచి నరలోకంలోకి తీసుకొస్తాను. అయితే నువ్వు నే చెప్పినట్లు వినాలి!"

హైమ చేతిని నా చేతిలోకి తీసుకుని ప్రేమగా నొక్కాను.

"హైమా! ఇది విను. నీ మనసులో ఉన్న దేమిటో నాతో చెప్పు నిస్సంకోచంగా, నిర్ద్వంద్వంగా చెప్పు! శరీరం బలంగా లేకపోతే ఆహారం పెడతాం. రక్తహీనత అయితే రక్తం ఎక్కిస్తాం. ఇనుమో, హార్మోనులో తక్కువైతే టానిక్కు లిస్తాం. అయితే నీ బలహీనతకు ఇంకో కారణం ఉంది. శరీరమూ, ఆత్మా కూడా నిస్సారమయ్యేంత అనురాగ విహీనతను నువ్వు అనుభవిస్తున్నావు!"


ఆమె కళ్లు నా మాటలు వినగానే భయంతో విచ్చుకున్నాయి. స్పృహ తప్పిపోతున్నట్లుగా, తన రహస్యం తెలిసిపోయినట్లుగా, విహ్వాల స్వరంతో అన్నది - "వద్దు, వద్దు! అలా చెప్పకండి! అలా అనకండి! ప్లీజ్! ప్లీజ్!"

ఆ క్షణంలో ఆమె గుండె బద్దలవుతుందేమో అనిపించింది నాకు. ఊహుఁ, నాకూ హైమ క్కూడా ఒక్కటే దారి, ఒక్కటే ఆశ. మేం ముందుకే వెళ్లాలి. భవిష్యత్తు మా కోసం కాచు క్కూర్చుంది.

నే నామెను నా సందిట్లోకి తీసుకున్నాను. పసిపిల్లను లాలించినట్లుగా లాలించాను -

"చూడు, హైమా! మనిషి గుండెలో ఎంత వాత్సల్య ముంటుందో తెలుసా? సముద్రమంత! అది నిరంతరం విస్తరిస్తూనే ఉంటుంది. జీవితంలోకి ప్రవహిస్తుంది, ఖర్చైపోతుంది అనుభవంలో. మళ్లీ మృదుత్వంలో, ప్రేమలో, స్నేహంలో, వెచ్చదనంలో, ఆశలో అది రీఛార్జి అవుతుండాలి. అట్లా అవుతున్నంత కాలం మనం బతికున్నట్లు, రాగ సముద్రమే ఇంకిపోతే మన బతుకులకు అర్థమే లేనట్లు ..." అన్నాను.

ఆమె వదనంలో నా మాటల శక్తి తరళాయిత మవుతోంది. నన్ను ఇంకా వినడానికి ఆమె ఉత్సహిస్తున్నట్లు తెలుస్తోంది.




"చూడు, హైమా! ఆ ముసిలావిడ - మీ అవ్వ నీ ఆశల్ని మింగేసింది. నీ ప్రేమను భగ్నం చేసింది. నీ జీవితాశయాన్ని దూరం చేసింది. ఇవి చాలదన్నట్లు నీ పిల్లల్నే నీకు కాకుండా చేసింది!"

"పిల్లలా!" హైమ పెదిమలు మెల్లగా పలికాయి.

"అవును. బొమ్మలన్నీ నీ పిల్లలే! ఎప్పుడైతే స్త్రీగా పరిపూర్ణంగా ఎదగడానికి నీకు అవకాశం లేదని గ్రహించావో, అందుకు పరిహారంగా నీ ఆశల్ని నీ కలల్ని ఒక తల్లిలాగా, ఒక కళాకారిణిలాగా నీ హృదయంలో ఒక భాగాన్ని ప్రతి బొమ్మలోనూ దాచుకుంటూ వచ్చావు. వాటిని ప్రేమతో సృష్టించావు. స్వంత పిల్లల్ని ప్రేమించినంతగా వాటిని ప్రేమించావు. అయితే పుట్టిన వెంటనే తల్లి నుంచి వేరు చేసి బిడ్డను తీసుకు వెళ్లిపోయినట్లుగా, డబ్బు జబ్బుతో మీ అవ్వ వాటిని నీ నుంచి తీసుకెళ్లిపోయి అమ్ముకుంది - అందుకు ప్రతిఫలం ఇంకేమీ ఇవ్వకుండా! నీ గుండెలోంచి, నీ కణాల్లోంచి, నీ రక్తంలోంచి ప్రతిసారీ ఇలా కొంత కొంత నువ్వు పోగొట్టుకుంటూ వచ్చావు. చివరకు అంతా పోగొట్టుకుని ఇలా మిగిలావు!"

హైమ కిప్పుడు అర్థమైంది తన పరిస్థితి. నన్ను గట్టిగా కౌగలించుకుని వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

"కానీ, హైమా! నా హైమా! ని న్నిలా అన్నీ పోగొట్టుకునే ఒంటరి మానులా ఉండనివ్వను, హైమా! నీకు నేను ప్రేమను పంచిస్తాను. నీలోనుంచి దోచుకున్న దంతా తిరిగి నువ్వు పొందేట్లు చేస్తాను. ఇలా చూడు, నన్ను! కళ్లెత్తి చూడు, కళ్లనీళ్లు తుడుచుకు చూడు! నన్ను కలల కవి అంటారు పిచ్చివాళ్లు. నా కలలు నీలాంటివాళ్ల కోసమే! నిన్ను నే ప్రేమిస్తున్నాను, హైమా! నిన్ను విడిచి నే నుండలేను, హైమా!"

హైమ నన్ను హత్తుకుంటూ అన్నది - "కానీ ... కానీ ... నే నవిటిదాన్ని కదా!"

"ఇంతకు వెయ్యి న్నొక్కరెట్లు నీలో అవిటితనం ఉన్నా ఇంకా వెయ్యిన్నొక్క రెట్లు నిన్ను నేను ప్రేమిస్తూనే ఉంటాను, హైమా! నీ అవిటితనం నిజం కాదు, ఆ ముసిల్ది అబద్ధం చెప్పింది. నువ్వు బాగవుతావు! నా డాక్టరు ఫ్రెండు చెప్పాడు. అయిదారు నెలల్లోనే నువ్వు మామూలు మనిషి వవుతావు. అందరిలాగానే తిరుగుతావు, నడుస్తావు, పరుగెత్తుతావు!"

ఆ తర్వాత ఏం జరిగిందన్నది అనవసరం. నేనూ, హైమా కలిసి ముసిల్దానికి బుద్ధి వచ్చేటట్లు చేశాం. ఇప్పు డవ్వ అనాథాశ్రమంలో ఆయాగా ఉంటోంది. మావాళ్లు నా పెళ్లికి రాలేదు. ఇవ్వాళ మా అమ్మాయి పుట్టినరోజు. ఎందు కొస్తారు - నాకు తెలుసు.

బుడిగి పాడుతున్న తత్వం ఇంకా మంద్రస్థాయిలో వినబడుతూనే ఉంది. ఆ తత్వానికి సవరణగా నేనే ఇంకో తత్వం అందుకున్నాను -

మట్టిలో పుట్టావు మనిషీ,
మట్టిలో కలిసేవు మనిషీ
మట్టీ మట్టికి మధ్య మనిషీ
మమత ఉంటే బతుకు మనిషీ
మట్టీ మట్టికి మధ్య మనిషీ
మమత పోతే చితుకు మనిషీ!

"బాగుంది, మీ సవరణ!" అంటూ ముందుకు వంగిన హైమ - అటూ ఇటూ చూసి గభాలున నా బుగ్గ మీద ఓ ముద్దు పెట్టి, "ఇదేనా మమతంటే?" అంటూ ఇంట్లోకి పరుగెత్తింది.

తల్లి చేసిన పనికి తనకు అర్థం తెలుసన్నట్లుగా ఇందు కిసుక్కున నవ్వింది. బయట నుంచి జనం రావడం మొదలైంది. వాళ్లందరూ దేవుడు చేసిన బొమ్మలు. ఆ బొమ్మలు మళ్లీ బొమ్మల్ని చేస్తాయి. దేవుడి బొమ్మలైనా, మనుషుల బొమ్మలైనా బతకాలన్నా బతుకు పండించుకోవాలన్నా రాగరంజితమైనప్పుడే అని నా కనిపిస్తోంది.

★